**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండ అల్కాపురి కాలనీలోని బెగోనియా హోమ్స్‌లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కొలువుదీరిన గణనాథుడికి 120 రకాల ప్రత్యేక స్వీట్లతో మహా నైవేద్యం సమర్పించారు. ప్రత్యేకంగా సిద్ధం చేసిన వివిధ రకాల స్వీట్లను గణేశుడికి సమర్పించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించి గణనాథుడికి మహాభోగ్ సమర్పించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 120 రకాల స్వీట్లతో సిద్ధం చేసిన నైవేద్యాన్ని గణేశుడికి సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ కార్యక్రమంలో పాల్గొని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులను అభినందించారు. గణేశ్ ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి దాతలు హరీష్, మౌనిక, సుభాష్, ఉషా, ఉమా తదితరులు సహకారం అందించారు. నిర్వాహకులు నాగరాజు, సుధా మాధురి, ఉమాదేవి, ఉషారాణి, ఆకాష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాలనీలో గణనాథుడికి ప్రత్యేక నైవేద్యం సమర్పించిన సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల జయజయధ్వానాలతో బెగోనియా హోమ్స్ మార్మోగింది.

# గణేశ్ నిమజ్జనానికి పటిష్ఠ ట్రాఫిక్ ఏర్పాట్లు






- **వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**
- **నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్ జేసీపీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలన**

**సైబరాబాద్ - విశాల భారతి**

గణేశ్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చేపట్టిన ట్రాఫిక్ నియంత్రణ, మళ్లింపు మార్గాలు, పార్కింగ్, బారికేడింగ్ ఏర్పాట్లను ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు నిమజ్జన ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువు వద్ద నిమజ్జనానికి వచ్చే వాహనాలు, భక్తుల రాకపోకలను అధికారులు పరిశీలించారు. నిమజ్జన వాహనాల కదలికలు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, బారికేడింగ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సిబ్బంది విధుల నిర్వహణపై ఆరా తీశారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. అనంతరం జీడిమెట్ల ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని సూరారంలోని కట్టమైసమ్మ చెరువు (లింగం చెరువు)ను పరిశీలించారు. నిమజ్జన వాహనాలు, భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. అవసరమైన ప్రాంతాల్లో బారికేడింగ్, వాహనాల మళ్లింపు, పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తర్వాత కేపీహెచ్‌బీలోని ప్రగతినగర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు వాహనాలతో తరలివచ్చే నేపథ్యంలో పార్కింగ్ ప్రాంతాలను క్రమబద్ధీకరించాలని, నిమజ్జన వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను సమర్థంగా అమలు చేయడంతోపాటు కీలక ప్రాంతాల్లో తగినంత సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ట్రాఫిక్ జేసీపీ సన్‌ప్రీత్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలన్నారు. సాధారణ వాహన రాకపోకలకు వీలైనంత తక్కువ అంతరాయం కలిగేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పరిశీలనలో ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిణి రెడ్డి, అదనపు డీసీపీ ఏ. వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గణేశ్ నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు, నిమజ్జన వాహనాల సాఫీ రాకపోకలతోపాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.



# ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

శేరిలింగంపల్లి ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మీయాపురం సుధాకర్‌ను ఖాజాగూడ గ్రామ మహిళలు, అక్కాచెల్లెళ్లు సోమవారం ఘనంగా సన్మానించారు. శేరిలింగంపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎంఆర్పీఎస్ మహిళా నాయకులు ఆయన నివాసానికి చేరుకుని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తనను మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన అడుగుజాడల్లో నడుస్తానన్నారు. అన్ని వర్గాలను కలుపుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మహిళా నాయకులు పారిజాత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# హుడా కాలనీలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థల పరిశీలన



- **క్యూర్ ఏరియాలో ప్రతిపాదిత పాఠశాల సముదాయానికి స్థల గుర్తింపు**
- **అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**

**సైబరాబాద్ - విశాల భారతి**

క్యూర్ ఏరియాలో ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా మియాపూర్ సర్కిల్ 48 పరిధిలోని హుడా కాలనీలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, ఐఏఎస్, ఉప కమిషనర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంబంధిత విభాగాల అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. క్యూర్ ఏరియాలో ప్రతిపాదించిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు అవసరమైన స్థలం, పరిసర ప్రాంత పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్థలం అనుకూలత తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. పాఠశాల సముదాయానికి అనువైన స్థలాన్ని గుర్తించి తదుపరి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో ఈ పరిశీలన చేపట్టారు. స్థల పరిశీలన సందర్భంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ తదితర విభాగాలకు సంబంధించిన వివరాలను అధికారులు పరిశీలించారు. స్థలానికి సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, పరిసర ప్రాంతాల పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించేందుకు చేపట్టిన ఈ పరిశీలనలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత వివరాలను నమోదు చేసుకున్నారు. తదుపరి ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుష్మా యాదవ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, మున్సిపల్ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రశాంతంగా.. సురక్షితంగా నిమజ్జనాలు

- **అధికారుల సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు**
- **సీపీ రమేశ్ సమీక్ష**

**సైబరాబాద్ - విశాల భారతి**



గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్ ఆదేశించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో పోలీస్‌స్టేషన్లవారీగా నిమజ్జనాల పరిస్థితి, భద్రత, ట్రాఫిక్ ఏర్పాట్లను సమీక్షించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు పూర్తయిన, ఇంకా నిమజ్జనం కావాల్సిన గణేశ్ విగ్రహాల వివరాలను సీపీ తెలుసుకున్నారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్, మార్గాల సమస్యలపై ఆరా తీశారు. ప్రధాన కూడళ్లు, నిమజ్జన కేంద్రాల వద్ద ముందస్తు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. పోలీసులు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, తోపులాటలు జరగకుండా బారికేడ్లు, పోలీసు సిబ్బంది మోహరింపును సమర్థంగా అమలు చేయాలని సీపీ తెలిపారు. సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.

**465 మంది అదనపు బలగాలు..**

సైబరాబాద్ పరిధిలో నిమజ్జనాల బందోబస్తు కోసం ఇతర జిల్లాలు, పోలీసు యూనిట్ల నుంచి రెండు దశల్లో మొత్తం 465 మంది అదనపు సిబ్బందిని రప్పించారు. తొలి దశలో 189 మంది, రెండో దశలో 276 మంది చేరుకున్నారు. వీరిలో 5 మంది ఏసీపీలు, 6 మంది సీఐలు/రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, 18 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 99 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, సుమారు 250 మంది కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా కానిస్టేబుళ్లు, 74 మంది హోంగార్డులు ఉన్నారు. జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు టీజీఎస్పీ, పీటీసీ వరంగల్, మల్టీజోన్-2 నుంచి అదనపు బలగాలను రప్పించారు. వీరిని నిమజ్జన మార్గాలు, కేంద్రాలు, ప్రధాన కూడళ్ల వద్ద మోహరించి ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతలు, ప్రజల భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

**పోలీసులకు సహకరించాలి..**

నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ మార్గదర్శకాలను పాటించాలని సీపీ కోరారు. వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని, నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నారులు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీసులను సంప్రదించాలని కోరారు. సమీక్ష సమావేశంలో సీఎంసీ కమిషనర్ సృజన, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాసరావు, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మ్యాట్రిమోనీ సైట్లే అడ్డా.. యువతులే టార్గెట్

- **నకిలీ ఎన్నారై అవతారంలో వల**
- **పెళ్లి పేరుతో నమ్మించి మోసం**
- **2021 నుంచి 19 కేసుల్లో ప్రమేయం**
- **పీడీ యాక్ట్‌తో కటకటాల్లోకి**

**సైబరాబాద్ - విశాల భారతి**

పెళ్లి సంబంధం కోసం మ్యాట్రిమోనీ సైట్లోకి వెళ్లిన యువతికి ఓ ప్రొఫైల్ కనిపిస్తుంది. మంచి చదువు.. విదేశాల్లో ఉద్యోగం.. ఉన్నత కుటుంబ నేపథ్యం.. ఆర్థికంగా స్థిరమైన వ్యక్తి అన్న వివరాలు కనిపించడంతో నమ్మకం కలుగుతుంది. పరిచయం కాస్తా మాటలుగా.. మాటలు స్నేహంగా.. ఆ తర్వాత పెళ్లి హామీగా మారుతుంది. ఇదే నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అవసరం పేరుతో డబ్బులు అడగడం మొదలవుతుంది. తీరా విషయం తెలిసేలోపే బాధితులు మోసపోయినట్లు గుర్తిస్తారు. సైబరాబాద్ పోలీసులు వెలుగులోకి తీసుకొచ్చిన ఓ మ్యాట్రిమోనీ మోసగాడి వ్యవహారమిది.



పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామానికి చెందిన మండా వెంకట కామేశు అలియాస్ కార్తిక్‌రెడ్డి (33) మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లను తన మోసాలకు వేదికగా మార్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. బీటెక్ చదివిన అతడు సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతో అవివాహిత యువతులను లక్ష్యంగా చేసుకున్నాడు. ఇందుకోసం నకిలీ ప్రొఫైళ్లు సృష్టించి.. తాను ఎన్నారై అని, మంచి విద్యార్హతలు, ప్రముఖ కుటుంబ నేపథ్యం, అధిక వేతనంతో కూడిన ఉద్యోగం ఉన్నట్లు తప్పుడు వివరాలు ఇచ్చేవాడు. అసలు పేరు బయటపడకుండా కార్తిక్‌రెడ్డి వంటి కల్పిత పేర్లను ఉపయోగించేవాడు.


**పరిచయం.. నమ్మకం.. ఆపై వల...**

మ్యాట్రిమోనీ యాప్‌ల ద్వారా పరిచయమైన యువతులతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిరంతరం మాట్లాడేవాడు. మొదట వారి వ్యక్తిగత విషయాలను తెలుసుకుని.. ఆ తర్వాత భావోద్వేగపూరిత సంభాషణలతో మరింత సన్నిహితంగా మారేవాడు. పెళ్లి చేసుకుంటానని హామీ ఇస్తూ వారి నమ్మకాన్ని పూర్తిగా సంపాదించేవాడు. ఆ తర్వాతే అసలు మోసం మొదలయ్యేది. తన సోదరి చదువుకు డబ్బులు అవసరమని.. బ్యాంకులో సమస్య వచ్చిందని.. అత్యవసరంగా ఆర్థిక సహాయం కావాలని.. లావాదేవీల పరిమితి పూర్తయిందని.. ఇలా ఒక్కోసారి ఒక్కో కారణం చెప్పి డబ్బులు బదిలీ చేయించుకునేవాడు. బాధితులు పెళ్లి చేసుకోబోయే వ్యక్తే కదా అనే నమ్మకంతో డబ్బులు పంపించేవారని పోలీసులు వెల్లడించారు. బాధితుల నుంచి డబ్బులు తీసుకోవడంతోనే ఆగకుండా వారి క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని కూడా సేకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వాటిని అనధికారిక ఆర్థిక లావాదేవీలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు వినియోగించినట్లు గుర్తించారు.

**19 కేసులు.. ఇక పీడీ యాక్ట్..**

ఇలా ఒక్కరిద్దరితో కాకుండా 2021 నుంచి ఇప్పటివరకు మొత్తం 19 మోసం కేసుల్లో కామేశు ప్రమేయం ఉన్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించినప్పటికీ.. మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడే అవకాశం ఉందని పోలీసులు భావించారు. దీంతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేశ్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండా వెంకట కామేశు అలియాస్ కార్తిక్‌రెడ్డిని చెర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధించారు. మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, బ్యాంకు వివరాలు లేదా ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

# చెరువులో మట్టి మాఫియా బరితెగింపు





- **అక్రమ తవ్వకాలు అడ్డుకున్న మహిళా సర్పంచ్‌కు బెదిరింపులు**
- **అధికారుల మౌనం ఎందుకు..?**
- **విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;**

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామంలోని బూర్లవాని చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గత కొద్ది రోజులుగా చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో గ్రామ సర్పంచ్ బండ రాజేశ్వరి అక్కడికి చేరుకుని అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టవద్దని కోరినట్లు తెలిపారు. అయితే, మట్టి తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేసిన తనను మహిళ అని కూడా చూడకుండా దుర్భాషలాడుతూ బెదిరించారని సర్పంచ్ ఆరోపించారు. ఈ ఘటన మీడియా సమక్షంలోనే జరిగిందని ఆమె పేర్కొన్నారు.

**రాజకీయ అండతోనేనా..?**

చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ తరలింపులో గ్రామ ఉపసర్పంచ్ తుర్క వెంకటేష్, 10వ వార్డు సభ్యుడు గాండ్ల వినయ్, వారి అనుచరులు సంబంధం ఉన్నట్లు సర్పంచ్ ఆరోపించారు. అలాగే స్థానిక అధికార పార్టీ జిల్లా నాయకుడికి చెందిన యంత్రాల సహాయంతోనే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు.

**మరో విషాదం జరగకూడదనే అడ్డుకున్నా.**

పక్క గ్రామమైన పిల్లిగుండ్ల తండా గ్రామపంచాయతీ పరిధిలో గత నెలలో చెరువులో మట్టి తవ్వకాల నేపథ్యంలో తల్లి, కుమారుడు మృతి చెందిన ఘటనను సర్పంచ్ గుర్తుచేశారు. అలాంటి విషాదం గుండ్రాతిమడుగులో పునరావృతం కాకూడదనే ఉద్దేశంతోనే చెరువులో అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు వెళ్లినట్లు తెలిపారు.

**చెరువులను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది?**

అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయా? జరిగితే ఎవరి అనుమతితో జరుగుతున్నాయి? మట్టి తరలింపునకు ఉపయోగిస్తున్న యంత్రాలకు అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అక్రమ తవ్వకాలు నిజమైతే తక్షణమే అడ్డుకుని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామ చెరువులను పరిరక్షించాలని సర్పంచ్ బండ రాజేశ్వరి అధికారులను కోరారు. మట్టి తవ్వకాలపై సర్పంచ్ చేసిన ఆరోపణలపై వివరణ కోరేందుకు సంబంధిత ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా స్పందించలేదు.

# 800 నామినేషన్లలో డీపీఎస్ మహబూబాబాద్‌కు ఘన గుర్తింపు

- **జాతీయ వేదికపై డీపీఎస్ మహబూబాబాద్ ప్రతిభకు అరుదైన గుర్తింపు**
- **విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణే విజయానికి అసలైన బలమన్న యాజమాన్యం**
- **జాతీయ స్థాయి పాఠశాలల ప్రతిభా పురస్కారాల్లో మూడు ప్రతిష్ఠాత్మక గౌరవాలు**




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి స్టాఫ్ రిపోర్టర్;** విద్యా రంగంలో డీపీఎస్ మహబూబాబాద్ మరో అరుదైన ఘనతను సాధించింది. న్యూఢిల్లీలోని యశోభూమి, ద్వారకలో నిర్వహించిన "ఎడ్యు ఎక్స్‌పో గ్లోబల్ పాఠశాల అత్యుత్తమ ప్రతిభా పురస్కారం" 2026లో దేశవ్యాప్తంగా వచ్చిన 800 నామినేషన్లలో డీపీఎస్ మహబూబాబాద్ ఎంపికై మూడు ప్రతిష్ఠాత్మక గౌరవాలను అందుకుంది. పాఠశాల వేగవంతమైన అభివృద్ధి, అభివృద్ధి చెందుతున్న ఉత్తమ పాఠశాలగా ఒక పురస్కారం, నాయకత్వ ప్రతిభ -దూరదృష్టితో కూడిన పాఠశాల నిర్వహణకు మరో పురస్కారం, విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు, విలువలు, పౌర బాధ్యతలను పెంపొందించడంలో ప్రతిభకు మరో పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ జె. ప్రమోద్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, మహేందర్ రెడ్డి మరియు పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. పాఠశాల విద్యా ప్రమాణాల పెంపు కోసం చేస్తున్న నిరంతర కృషికి జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు గొప్ప గౌరవమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి. మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుధీర్ కుమార్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను స్వీకరించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ఉన్నత ప్రమాణాలతో కృషి చేస్తామని వారు తెలిపారు. విద్యార్థులే విజయానికి కేంద్రబిందువు డీపీఎస్ మహబూబాబాద్ సాధించిన ఈ ఘనతను పాఠశాల విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల ఉత్సాహం, క్రమశిక్షణ, సృజనాత్మకత, నేర్చుకోవాలనే తపన, ప్రతిభే పాఠశాల విజయానికి అసలైన బలమని తెలిపింది. దేశవ్యాప్తంగా 800 నామినేషన్లలో ఎంపికై మూడు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకోవడం ద్వారా డీపీఎస్ మహబూబాబాద్ జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుంది.

# కుంట్లూరులో ఘనంగా గణేష్ ఉత్సవాలు

- చిన్నారుల భరతనాట్యంతో అలరించిన వేడుకలు




**విశాల భారతి అబ్దుల్లాపూర్‌మెట్ :** నాగోల్ సర్కిల్ కుంట్లూర్ డివిజన్‌లోని రవిశంకర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉబ్బ సురేష్, సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నృత్యాంజలి డాన్స్ అకాడమీ గురూజీ ప్రణవి పర్యవేక్షణలో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల ప్రతిభను చూసి కాలనీవాసులు, భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు కాలనీ అసోసియేషన్ తరఫున బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భరతనాట్య బృందం చిన్నారులు అనంతుల క్రితిక రెడ్డి, ఊర్వి, సిద్ధిశ్రీ, మధుహాసిని, లక్కీసింగ్, ఆరాధ్య, కిరణ్మయి, ప్రధన్య, మౌనిత, సమన్విత, మనస్వి, చరిత, గౌతమి తదితరులతో పాటు కాలనీ మహిళలు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

# ఇబ్రహీంపట్నంలో దంత వైద్య శిబిరం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కమ్యూనిటీ హాల్ లో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ దంతా వైద్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి , కౌన్సిలర్ యాదగిరి పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 150 మందికి పైగా విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, సిహెచ్ సి సూపరింటెండెంట్ డా. శ్రీలత, డిప్యూటీ సివిల్ సర్జన్ డా. లక్ష్మి ప్రసన్న, దంత వైద్య నిపుణులు డా. శ్రీలక్ష్మి, డా. కీర్తి, డా. ఉషాశ్రీ, పీపీ యూనిట్ డా. సమీరా ఆస్రా తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నామస్మరణతో మారుమోగుతున్న వినాయక మండపాలు

- చెంగిచెర్ల వినాయక మండపాలను సందర్శించిన ఏనుగు
- సుదర్శన్ రెడ్డి, తుప్పత్ ఆనంద్
- ప్రత్యేక పూజల నిర్వహణ, అన్న ప్రసాద వితరణ ప్రారంభం
- సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకుంటున్న చిన్నారులు



**బోడుప్పల్, విశాల భారతి ;** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్లో 8వ రోజు గణపతి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చెంగిచెర్ల డివిజన్లో పరిధిలోని ఎస్ వై నగర్ కాలనీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బిజెపి నాయకులు తుప్పత్ ఆనంద్ తదితరులు పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా చెంగిచెర్ల ఆర్ టీ సి కాలనీ, ఎం ఎల్ కాలనీలలో శ్రీ గణపతి మండపాలను దర్శించి ఆ గణనాథుని ఆశీర్వాదం పొందడం పొందారు. అనంతరం ఆయా మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించడం జరిగింది. ప్రతి మండపం దగ్గర పిల్లలు, పెద్దలు, మహిళలు భక్తిశ్రద్ధలతో భజనలు, పూజలు నిర్వహిస్తూ, మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు, భక్తి పాటలతో విశేషంగా ఆకట్టుకుంటున్నారని తుప్పత్ ఆనంద్ అన్నారు. విగ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సకల సౌభాగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో అన్ని ర భరత్ విశ్వ గురువుగా చెందాలని ఆకాంక్షించినట్లు తుప్పత్ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, శ్రీ గణపతి మండప నిర్వహకులు, కాలనీ వాసులు, మహిళలు,పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కర్ణంగూడ శ్రీ ఆంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా గణపతి హోమం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కర్ణంగూడ గ్రామంలో శ్రీ ఆంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు గణేష్ మండపం ముందు ప్రత్యేక గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ హోమంలో గ్రామానికి చెందిన 20 మంది దంపతులు సంప్రదాయబద్ధంగా పాల్గొన్నారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ, భక్తి శ్రద్ధలతో హోమ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా సాగింది. గ్రామంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, భక్తులకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా చూడాలని గణనాథుడిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆంజనేయ భజన మండలి చైర్మన్ యంపల్ల మహిపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు నల్లబోలు శ్రీనివాస్ రెడ్డి హాజరై భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ వంగేటి తిరుమల్ రెడ్డి, ఉప సర్పంచ్ యంపల్ల రవీందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమాన్ని విజయవంతం చేశారు. ప్రతి ఏటా భజన మండలి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ప్రత్యేకంగా దంపతులతో హోమం నిర్వహించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. హోమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

# ధరావత్ దేవేందర్‌కు ఘన సన్మానం



విశాలభారతి, గూడూరు : ఇటీవల సీఐ నుంచి డీఎస్పీగా పదోన్నతి పొందిన తెలంగాణ ముఖ్యమంత్రి సెక్యూరిటీ వింగ్ ఆఫీసర్ ధరావత్ దేవేందర్‌ను గూడూరు మండలానికి చెందిన సహచర సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఏజెన్సీ గ్రామమైన ఏపూరు తండాకు చెందిన ధరావత్ దేవేందర్ 2008 బ్యాచ్‌లో ఎస్ఐగా ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వద్ద సుమారు పదేళ్లపాటు వ్యక్తిగత సహాయకుడిగా సేవలందించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సెక్యూరిటీ వింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న దేవేందర్ ఇటీవల సీఐ నుంచి డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా గూడూరు మండలానికి చెందిన సహచర సీఐలు భానోత్ కాశీరాం, జాటోత్ వసంత్ కుమార్, వాంకుడోత్ హథిరాం పవర్, సోములు నాయక్‌లు దేవేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయనకు పదోన్నతి లభించిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# మన అంగన్‌వాడీ మన బాధ్యత

- 9వ జాతీయ పోషణ మాసం థీమ్ ఆవిష్కరణ
- పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం
- అదనపు కలెక్టర్ డాక్టర్ కే.కిరణ్మయి ఐ.ఏ.ఎస్




**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** రంగారెడ్డి జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం మన అంగన్‌వాడీ మన బాధ్యత అనే థీమ్‌ను అదనపు జిల్లా కలెక్టర్ డాక్టర్ కే.కిరణ్మయి ఐ.ఏ.ఎస్. ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతిరోజూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తగినంత ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకునేలా కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రాథమిక విద్య, బాలల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం, పోషణకు కీలక కేంద్రాలుగా పని చేస్తున్నాయని తెలిపారు. పోషణ మాసం సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లా సంక్షేమ అధికారి జి. శాంతిశ్రీ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాజెక్టుల పరిధిలో పోషకాహారం, ఆహార వైవిధ్యం, ఆరోగ్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల్లో అందించే వేడి వండిన భోజనం ( హెచ్ సి ఎం ) నాణ్యత, పోషక విలువలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.అంగన్‌వాడీ సేవలపై ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన ( పి ఎం ఎం వి వై ) ప్రయోజనాలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన అలవాట్లపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆనందదాయకమైన వాతావరణంలో ప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించినప్పుడే చిన్నారుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యాశాఖ, అంగన్‌వాడీ కేంద్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయడం ద్వారా పిల్లల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచవచ్చన్నారు. ఆటలు, కథలు, పాటలు, పరస్పర చర్యల ద్వారా చిన్నారుల్లో సామాజిక, మానసిక అభివృద్ధిని ప్రోత్సహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ (ఇబ్రహీంపట్నం) సూర్యరత్న, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, సీడీపీఓలు వెన్నెల, కాంతిరేఖ, రేణుక, హసీబా, కవిత, ఉదయ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయ కర్త డి. శ్రీనివాస్, బ్లాక్ కోఆర్డినేటర్లు కె. శ్రీనివాస్ (ఇబ్రహీంపట్నం), ఎన్. శ్రీనివాస్ (చేవెళ్ల), ఎ. యాదగిరి (హయత్‌నగర్), సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ నిమర్జనం శాంతియుతంగా నిర్వహించాలి

- గణేశ్ నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలన
- ప్రజలకు తాగునీరు మౌలిక వసతులు కల్పించాలి
- ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి
- మున్సిపల్ చైర్మన్ టేకుల \ సుదర్శన్ రెడ్డి



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** గణేశ్ నిమర్జనం శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, కమిషనర్ వై సుదర్శన్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన గోశాల చెక్ డ్యాం (తట్టిఖాన), శేరిగూడ చెక్ డ్యాం ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిమజ్జన ఘాట్‌ల వద్ద ప్రజలకు తాగునీరు, లైటింగ్, శానిటేషన్ మౌలిక వసతుల వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. నిమజ్జనం కు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అదికారులను ఆదేశించారు. విగ్రహాల తరలింపు సమయంలో ఎక్కడ విద్యుత్ షాక్ గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ వారికి సూచించారు.మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ మాట్లాడుతూ నిమర్జనం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిమర్జనం అంతయు ప్రశాంత వాతావరణం లో పూర్తి అయ్యేలా అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, శోభాయాత్ర వెళ్ళేమార్గం లో ఇతర శాఖ ల యొక్క సమన్వయము తో ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. వినాయక నిమజ్జను శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా అధికారులకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది ప్రణవ్, శివ, లింగం తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడ వైన్స్ హత్య కేసులో మరో ముగ్గురు అరెస్ట్

- ప్రధాన సూత్రధారి ఉమా మహేష్ సహా ముగ్గురు పట్టివేత
- అరెస్టుల సంఖ్య 11కు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో రౌడీషీటర్ నయీమ్ హత్య కేసులో పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారి సహా మరో ఇద్దరిని నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మంకు చెందిన కె. ఉమా మహేష్ అలియాస్ జేకే మహేష్ (34), సాయినగర్‌కు చెందిన మహమ్మద్ మున్నా అలియాస్ బోలె (47), ఖమ్మం జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దుగ్గిరాల కార్తీక్ (29)లను ఎల్‌బీనగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. తాజాగా ముగ్గురి అరెస్టుతో ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య 11కు చేరింది. ఈ నెల 14న బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్‌పై నిందితులు వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈ నెల 16న ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రధాన సూత్రధారి ఉమా మహేష్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు తాజాగా అతడితో పాటు మరో ఇద్దరిని పట్టుకున్నారు.

**బాల్య స్నేహితులే.. చివరకు కక్షతో హత్య**

పోలీసుల దర్యాప్తు ప్రకారం నయీమ్, ఉమా మహేష్ బాల్య స్నేహితులు. చిన్నతనం నుంచే నేరాలకు పాల్పడిన ఇద్దరిపై ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్లలో తిరిగే క్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు పెరిగి పరస్పరం కక్ష పెంచుకున్నారని వెల్లడించారు. నయీమ్ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, ఉమా మహేష్ ఖమ్మంలో సోలార్ ప్యానల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఖమ్మంలో పథకం.. హైదరాబాద్‌లో హత్య**

నయీమ్‌ను హత్య చేసేందుకు ఈ నెల 13న ఖమ్మంలోని ఓ హోటల్‌లో ఉమా మహేష్ తన అనుచరులతో కలిసి పథకం రచించినట్లు దర్యాప్తులో తేలిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మరుసటి రోజు ఖమ్మం నుంచి కారులో హైదరాబాద్‌కు వచ్చిన నిందితులు.. మహమ్మద్ మున్నా ద్వారా నయీమ్‌కు ఫోన్ చేసి అతడి ఆచూకీ తెలుసుకున్నట్లు చెప్పారు. బండ్లగూడ సుప్రీం వైన్స్‌లో నయీమ్ ఉన్నట్లు నిర్ధారించుకున్న అనంతరం అక్కడికి చేరుకుని దాడికి పాల్పడినట్లు వెల్లడించారు. వైన్స్ వద్ద నయీమ్ కళ్లలో కారం చల్లి వెంబడించిన నిందితులు.. సిట్టింగ్ ఏరియాలో వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా.. తాజాగా ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ మార్బుల్ జానీ తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్ డీసీపీ బి. అనురాధ ఐపీఎస్, ఎల్‌బీనగర్ ఏసీపీ రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

# టీచర్స్ కాలనీలో ఘనంగా అన్నదానం



**పాల్వంచ విశాల భారతి :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పాల్వంచ పట్టణంలోని టీచర్స్ కాలనీలో పట్టిపల్లి కళ్యాణ్‌రామ్-సరస్వతి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణనాథుడి మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 1,800 మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో వంటకాలను సిద్ధం చేసి, భక్తులకు ఆప్యాయంగా అన్నప్రసాదాన్ని అందించారు. దీంతో టీచర్స్ కాలనీలో పండుగ సందడి నెలకొంది.కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దారా చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాపర్తి వెంకటాచారి, కాంగ్రెస్ నాయకులు పారిపత్తి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్వదినాల్లో భక్తులకు అన్నప్రసాదం అందించడం గొప్ప సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. అన్ని దానాల్లో అన్నదానం విశిష్టమైనదని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు. కళ్యాణ్‌రామ్-సరస్వతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో కమిటీ లీడర్ దినేష్, విజయ, శ్రీదేవి, లలిత, నాని, ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో అన్నదాన కార్యక్రమం సజావుగా సాగింది. భక్తిశ్రద్ధలు, సేవాభావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం టీచర్స్ కాలనీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మైలర్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పద్మశాలిపురం, మాధుబన్ కాలనీ, అర్జన్ బస్తీ, ఎన్టీఆర్ నగర్, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజలపై విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులను ఎమ్మెల్యే అభినందించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, స్థానికులు సమన్వయంతో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మండపాల సందర్శన సందర్భంగా భక్తులు, స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఉత్సవ సమితి నిర్వాహకులు, కాలనీవాసులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంయమనంతో గణేష్ నిమజ్జనం జరుపుకోండి


- గాంధీనగర్ సీఐ సురేష్ బాబు



**సికింద్రాబాద్,విశాల భారతి :** వినాయక నిమజ్జనోత్సవాలను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత సంయమనంతో జరుపుకోవాలని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల నిర్వహణ, భద్రతా చర్యలపై స్థానిక మండపాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించిన ఆయన పలు కీలక సూచనలు, నిబంధనలను వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా శబ్ద కాలుష్యానికి తావులేకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో డీజేలు, పాడ్ బ్యాండ్‌లకు ఎలాంటి అనుమతులూ లేవని, ఈ విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి హంగామా చేయవద్దన్నారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రాత్రి 11 గంటల లోపే నిమజ్జన కార్యక్రమాలను, మైకుల వినియోగాన్ని పూర్తిగా ముగించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఊరేగింపు సాగే మార్గాల్లో విద్యుత్ తీగలతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన చోట్ల విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆయా మార్గాల్లో పవర్ సరఫరా లేకుండా చూసుకోవాలని సూచించారు. భక్తులకు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేసేందుకు గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 24, 25 తేదీల్లో రెండు భారీ క్రేన్లను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఊరేగింపులో భారీ వినాయక విగ్రహాలకు కరెంటు తీగలు అడ్డుగా వస్తే వాటిని కర్రలతో పైకి ఎత్తాలని సూచించారు. నిమజ్జన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని బందోబస్తుకు వినియోగిస్తున్నామన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో, పోలీసులకు సహకరిస్తూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# నిజమైన పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందిస్తుంది

- నానక్ నగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులుగా తాండ్ర అంజయ్య
- యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం



**విశాల భారతి ఇబ్రహీంపట్నం;** యాచారం మండల పరిధిలోని నానక్ నగర్ గ్రామంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి అందేశాలమేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీ ఎనుకున్నారు. అధ్యక్షులుగా తాండ్ర అంజయ్య, యూత్ అధ్యక్షుడు నక్క. పాండు, ఉపాధ్యక్షులు , గౌరారం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి, జోగు సత్తయ్య, కార్యదర్శి మర్రి భగవంత్ రెడ్డి,కోశాధికారి. దంతుక జంగయ్య కార్యవర్గ సభ్యులు, తిరువైపేట శ్రీనివాస్, మధుసూదన్, పెద్దయ్య, మేదిరెడ్డి సాయిరెడ్డి, మహిపాల్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిసి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాల వెంకట రెడ్డి, మోటె శ్రీశైలం. ఈ ఎన్నికను ఉద్దేశించి మాట్లాడుతూ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, గడపగడపకు చేరాలని, కాంగ్రెస్ పార్టీ నిజమైన పేదలకు, అర్హులకు, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు అందిస్తుందని అన్నారు, భవిష్యత్తులో పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ వల్ల న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చైతన్య రాజు, రంగా రెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పొలమోని రామకృష్ణ యాదవ్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయ ప్రకాష్ గ్రామ ఉపసర్పంచ్ అనిత కృష్ణారెడ్డి, మేడిపల్లి నక్కర్త ఉప సర్పంచ్ దేంది మధుకర్ రెడ్డి వార్డ్ మెంబర్ ధనరాజ్, జంగయ్య, సంతోష రాములు, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, హరి కిషన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, టీ . రత్నం , తాండ్ర పెద్దయ్య సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే సమగ్ర వ్యక్తిత్వ వికాసం

- క్రీడలు, సాంస్కృతిక రంగాలవైపు ద్రుష్టి సారించాలి
- గెలుపోటములను సమానంగా స్వీకరించాలి
- క్రీడాప్రతిభను ప్రోత్సహిస్తున్న ఎస్జిపి ఫౌండేషన్
- క్రీడా రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నా
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




**పాల్వంచ విశాల భారతి:** క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని శ్రీనివాస కాలనీలో శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్స్2026 ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలకు కూడా యువత ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే సమాజంలో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెంపొందుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. స్థానిక స్థాయి నుంచి జాతీయ స్థాయి టోర్నమెంట్లను నిర్వహించడం ద్వారా స్థానిక క్రీడాకారులకు మంచి అనుభవం, గుర్తింపు లభిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లోనూ క్రీడా మౌలిక వసతులు, మైదానాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల వైపు మళ్లేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కె సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు నాయకులు డి సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, గిరి, ఆవుల సతీష్, కాకటి రవీందర్, భూతం కిరణ్, ఉపేందర్ రెడ్డి, ఆదినారాయణ, రామారావు, సంజీవరావు, అల్లి వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలందరికి గణనాధుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలి

- బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్



**సికింద్రాబాద్, విశాల భారతి :** గణేష్ నవరాత్రుల సందర్భంగా శ్రీ వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆర్గనైజర్ వల్లపు మురళి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ నాయకులు,మాజీ వార్డు మెంబర్ మంద జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్, అంబానగర్ అధ్యక్షులు కొండా కిషోర్ గౌడ్,వల్లపు కృష్ణమూర్తి,మంద వెంకటస్వామి, చింతకింది మల్లేష్, ఒగ్గు శ్రీధర్, గబ్బెట రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఇన్ గెట్ ఆటో స్టాండ్ నందు ఎన్నికలు

- ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఎన్నికలు
- ఐక్యమత్యంగా ముందుకు సాగేందుకు పాటుపడాలి
- ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి
- ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలి



**భద్రాచలం: విశాల భారతి;** భద్రాచలం స్థానిక ఆర్టీసీ ఇన్ గేట్ ఆటో స్టాండ్ నందు కమిటీ ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఎన్నికలలో అధ్యక్షులుగా జక్కం హరిప్రసాద్ గెలుపొందారు ట్రెజరరీగా దళాయి ప్రసాద్ గెలుపొందారు ఎన్నికల అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలదండతో సత్కరించడం జరిగింది ఈ ఎన్నికలలో గెలుపొందిన వారికి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బొక్క రాంబాబు మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల నిబద్ధతతో పనిచేయాలని ఏ సమస్య వచ్చినా ఐక్యతతో అందరూ ఆ సమస్య పైన ఒకే మాట పైన ఉండాలని ఆయన సూచించారు ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆటో కార్మికుల కు జరుగుతున్న అన్యాయంపై సమగ్రంగా నివేదిక రూపొందించి ఆటో కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని చదువుకునే పిల్లలకు ప్రైవేటు పాఠశాలలు రాయితీ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఫ్రీ బస్సుల వల్ల ఆటో కార్మికులకు తీరని అన్యాయం జరిగిందని ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి ఆటో కార్మికులకు గౌరవ వేతనం అందించాలని ఉచిత బస్సుల వల్ల ఆటోలకు కిరాయి లేకుండా పోతుందని కుటుంబాలు పోషించలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన చెందారు ప్రభుత్వం ఆలోచించి ఆటో కార్మికులను వారి సమస్యల పైన సంక్షేమ పథకాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు

## బెగోనియా హోమ్స్‌లో ఘనంగా గణేశ్ పూజలు

- భక్తిశ్రద్ధలతో ఓమ్మం, మహాభోగ్, అన్నప్రసాదం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మణికొండలోని బెగోనియా హోమ్స్‌లో గణేశ్ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓమ్మం కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, గణపతి ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మహాభోగ్‌ను సిద్ధం చేసి గణేశుడికి నైవేద్యంగా సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం మహాభోగ్ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. నివాసితులు కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొని గణనాథుడికి భక్తిపూర్వకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ హాజరయ్యారు. ఆయన గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వాహకులు, నివాసితులతో కలిసి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి ఏ. హరీశ్, మౌనిక, సుభాష్, ఉషా, ఉమా దాతలుగా సహకరించారు. వారి సహకారంతో పెద్ద ఎత్తున అన్నప్రసాదాన్ని సిద్ధం చేసి భక్తులు, నివాసితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం కావడానికి విశేషంగా కృషి చేసిన సుధా మాధురి, ఉమాదేవి, ఉషారాణి, ఆకాష్‌తో పాటు సాంస్కృతిక కమిటీ సభ్యులకు నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూజా కార్యక్రమాలు, మహాభోగ్, అన్నప్రసాద కార్యక్రమాల్లో పాల్గొని సహకరించిన బెగోనియా హోమ్స్ నివాసితులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సామూహిక స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## బొక్కలగుట్ట ప్రజల సమస్యలకు పోలీసుల చొరవతో పరిష్కారం

- సర్వీస్ రోడ్డు, అండర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన: డీసీపీ భాస్కర్

**విశాల భారతి, రామకృష్ణాపూర్:** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామ ప్రజల రవాణా భద్రతను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను మంచిర్యాల డీసీపీ భాస్కర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాళ్లవాగు నుండి మంచిర్యాల వైపు సాగే ఈ సర్వీస్ రోడ్డు పనుల పురోగతిని, రక్షణ చర్యలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. బొక్కలగుట్ట పరిసర ప్రాంతంలో సరైన సర్వీస్ రోడ్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరిగి అనేక మంది గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందని దీనికితోడు ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో పూర్తి చీకటి అలుముకుని ప్రమాదకరంగా మారిన పరిస్థితులను గమనించిన పోలీసులు సమస్య తీవ్రతను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు శాఖ ప్రత్యేక చొరవతో జాతీయ రహదారుల సంస్థ (NHAI) సహకారంతో అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణంతో పాటు చీకటిని నివారించేందుకు 14 విద్యుత్ స్తంభాలతో కూడిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ పనులను వేగవంతం చేశారు. ప్రజల ప్రాణరక్షణ కోసం బాధ్యతాయుతంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ యంత్రాంగానికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్, పట్టణ ఎస్సై జై శ్రీధర్, ఫోర్ లేన్ అథారిటీ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు బొలిశెట్టి కనకయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి పూజలో కూచిపూడి నృత్యం.. సమ్మనితకు ఘన సత్కారం

**విశాల భారతి, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో, ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి పూజా కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గాదం సనల్ మనోహర్-మానస దంపతుల కుమార్తె, కూచిపూడి నృత్యకారిణి సమ్మనిత తన నృత్య ప్రదర్శనతో భక్తులను అలరించింది. ఆమె ప్రతిభను అభినందిస్తూ ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి శాలువాతో ఘనంగా సత్కరించారు. సమ్మనిత చిన్న వయసులోనే కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరుస్తుండటం అభినందనీయమని మధుసూదనాచారి పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ జిల్లా కమిటీ సభ్యులు గాదం పోచయ్య, రమణకుమారి, కాలనీవాసులు, స్థానికులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**విశాల భారతి, పరకాల ;** దామెర మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. దామెర ఎస్సై ఈ. వీరభద్రరావు, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, SRSP DEE అమృత రాజేష్, AEE నరేష్, RI, దామెర గ్రామ సర్పంచ్ కల్పన కృష్ణమూర్తి తదితరులు నిమజ్జన చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లు, నీటి పరిస్థితి, వాహనాల రాకపోకలు తదితర అంశాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్సై ఈ. వీరభద్రరావు కోరారు.

## మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ

**విశాల భారతి, పరకాల;** పరకాల పట్టణంలోని మున్నూరు కాపు సంఘం వినాయక మండపంలో మంగళవారం కుంకుమ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ వైద్యులు డా. సిరంగి సంతోష్ కుమార్ హాజరై మహిళలకు చీరలు బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల లక్ష్మణ్, మెంతుల సురేష్, మేకల కిరణ్, ఆకుల శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, ఆకుల రాకేష్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## యాసంగిలో పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి




- తీవ్ర వర్షా భావ పరిస్థితుల్లో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి
- 50 శాతం రాయితీతో మినుముల విత్తనాలు.. సద్వినియోగం చేసుకోవాలి
- రైతు నమోదు తప్పనిసరి.. యూరియా వినియోగాన్ని తగ్గించాలి

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు పప్పుధాన్యాల పంటలను సాగు చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. కురవి రైతు వేదికలో నిర్వహించిన మిషన్ ఆత్మ నిర్భరత పప్పుధాన్యాలు కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు మురళి రైతులకు 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న మినుముల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి జలాశయాల్లోకి నీరు చేరకపోవడంతో పాటు బోర్లు, బావులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని తెలిపారు. ఒక ఎకరా వరి పంటకు అవసరమయ్యే నీటితో రెండు నుంచి మూడు ఎకరాల్లో పప్పుధాన్యాల పంటలను సాగు చేయవచ్చని వివరించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు యాసంగిలో వరి సాగును తగ్గించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం 50 శాతం రాయితీతో మినుముల విత్తనాలను అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉన్నందున పప్పుధాన్యాల సాగు ద్వారా నీటి వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు నమోదులో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు నమోదు లేకపోతే పండించిన పంటను విక్రయించడంలో ఇబ్బందులు ఎదురవడంతో పాటు యూరియా సరఫరా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు అందే అవకాశం ఉండదని తెలిపారు. అందువల్ల రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. దేశంలోనే తెలంగాణ ప్రాంతంలో యూరియా వినియోగం అధికంగా ఉందని పేర్కొంటూ రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గుంటక నరసింహారావు, రాజేశ్వరి, రవళి, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విధులకు డుమ్మా కొట్టిన ఆరుగురికి షోకాజ్ నోటీసులు



**సికింద్రాబాద్ ,విశాలభారతి :** ప్రజలకు జవాబుదారీతనంతో సేవలు అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ పరిసరాలను, వివిధ విభాగాల్లో సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం హాజరు పట్టికను తనిఖీ చేయగా, ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఆరుగురు ఉద్యోగులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సమయపాలన పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే సామాన్య పౌరుల పట్ల ప్రతీ ఉద్యోగి పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ తేల్చిచెప్పారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. కొందరు సిబ్బంది డిప్యూటేషన్‌పై, మరికొందరు 'చేయూత' పెన్షన్ల పరిశీలన విధుల్లో ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న సిబ్బందితో ప్రజలకు సేవలందించేలా పక్కా ప్రణాళికతో పని చేయాలని సూచించారు .ఈ క్రమంలో రెవెన్యూ శాఖకు కీలకమైన భూముల రిజిస్టర్లు, ల్యాండ్ బ్యాంక్ వివరాలు, పెన్షన్ల ఆన్‌లైన్ అప్‌డేషన్, నిషేధిత భూముల (పీఓబీ) రిజిస్టర్లను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పీఓబీకి సంబంధించిన పూర్తి నివేదికను సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కంప్యూటర్ సెక్షన్‌ను పరిశీలించిన ఆమె, స్వయంగా సిస్టమ్‌లో లాగిన్ అయి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సామాజిక పింఛన్లు, ఆధార్ అప్‌డేషన్ వంటి పెండింగ్ దరఖాస్తుల వివరాలను ఆరా తీశారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు త్వరితగతిన అందేలా రోజువారీ డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట ఆర్డీవో సాయిరాం, తహసీల్దార్ పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పట్ల మనసున్న మారాజు



**విశాలభారతి, ఇందల్వాయి :** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ బాగిర్తి నారాయణ తన సొంత ఖర్చుతో రూ.15 వేల విలువైన స్పోర్ట్స్ దుస్తులను క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ దుస్తులు అందించినట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమం చేపట్టిన బాగిర్తి నారాయణను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వీడీసీ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న సేవ అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం అంటే భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడమేనని, ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు.

## నేడు మారేళ్ళ పాడు లిఫ్ట్ ఇరిగేషన్ను ప్రారంభించనున్న మంత్రులు

- మంత్రుల పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



**విశాలభారతిఅశ్వాపురం :** మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ పంప్ హౌస్ వద్ద నిర్మాణం చేపట్టిన మారేళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండలానికి రానున్నారు. తొలుత మారెళ్ళ పాడు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన నీటిని విడుదల అనంతరం అక్కడి నుండి గొందిగూడెం రైల్వే ట్రాక్ సమీపంలో ఇసుక వాగులోకి నీరు విడుదల చేస్తున్న ప్రాంతంలో మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం రైల్వే ట్రాక్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకతపై ప్రజలకు వివరించనున్నారు.

**మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ :**

నేడు మండలంలో జరగనున్న మంత్రుల పర్యటన, బహిరంగ సభ నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పరిశీలించారు. ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండొద్దని స్థానిక తహసిల్దార్ సూర్యప్రకాష్, ఎంపీడీవో ముత్యాలరావుకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. అదేవిధంగా మంత్రుల పర్యటనను విజయవంతం చేసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## భారతీయ భాషల ప్రాధాన్యత చాటుతూ

- ఘనంగా హిందీ సోషల్ అవుట్ రీచ్ కార్యక్రమం!




**పాల్వంచ విశాల భారతి, సెప్టెంబర్ 22:** స్థానిక స్టార్ చిల్డ్రన్ హై స్కూల్ వేదికగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ (అటానమస్) హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'హిందీ అవుట్ రీచ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 14న హిందీ భారతదేశానికి రాజభాషగా గుర్తింపు పొందిన చారిత్రక దినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ వేడుకకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగ అధ్యక్షురాలు డాక్టర్ టి. అరుణ కుమారి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందీ భారతదేశానికి ఒక జీవనాడి వంటిదని నేటి ఆధునిక ప్రపంచంలో ఈ భాష నేర్చుకోవడం ద్వారా అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన హ్యాండ్ రైటింగ్ పుస్తక పఠనం చార్ట్ పెయింటింగ్ ప్రముఖ కవులు మరియు రచయితల పరిచయాలు వంటి విభిన్న పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ భాషా ప్రాధాన్యతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హిందీ భాషా విశిష్టతను చాటుతూ ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కరరావు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరెడ్డి హిందీ అధ్యాపకురాలు జి. రమాదేవి ఇతర అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన ముచ్చుకుర్తి



**ముషీరాబాద్,విశాల భారతి:** ఇటీవల మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ను మీడియా ఇన్చార్జ్ ముచ్చుకుర్తి ప్రభాకర్ దంపతులు పరామర్శించారు. మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ లోని ముఠా గోపాల్ నివాసంలో కలిసి యోగా క్షేమాలను తెలుసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోగ్యంగా ఉంటూ ముషీరాబాద్ ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో తుడుము రాజేందర్, తుడుము లక్ష్మి తదితరులు ఉన్నారు.



### ఏడాదిగా సోషల్ మీడియాకు దూరంగా

# ఐశ్వర్య లక్ష్మి

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య లక్ష్మి గత ఏడాది కాలంగా సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్నారు. సాధారణంగా సినీ తారలు తమ సినిమాల ప్రచారం, వ్యక్తిగత విషయాలు, అభిమానులతో అనుసంధానం కోసం సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తుంటారు. అయితే ఐశ్వర్య లక్ష్మి మాత్రం అందుకు భిన్నంగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాజాగా తన నిర్ణయం వెనుక ఉన్న కారణాలను ఆమె వెల్లడించారు.సోషల్ మీడియాను పూర్తిగా వదిలేస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. మొదట కొంతకాలం మాత్రమే సామాజిక మాధ్యమాలకు విరామం తీసుకుని, ఆ తర్వాత మళ్లీ తిరిగి రావాలని భావించానని చెప్పారు. అయితే కాలం గడిచే కొద్దీ సోషల్ మీడియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించిన తర్వాత తిరిగి రావాలనే ఆలోచనను విరమించుకున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత కంటెంట్ విపరీతంగా పెరగడం, దాన్ని ఉపయోగించి కొందరు చేస్తున్న అసభ్యకరమైన ఎడిటింగ్ తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల్లో ఇలాంటి కంటెంట్ పెరుగుతుండటం తనకు నచ్చలేదని, చివరకు మానసిక ప్రశాంతత కోసం పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో ఉన్న సమయంలో కామెంట్లు, పర్సనల్ మెసేజెస్ తాను చదివేదాన్నని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అయితే వాటిని పదేపదే చదవడం వల్ల తనపై ప్రతికూల ప్రభావం పడేదని చెప్పారు. కొన్నిసార్లు ప్రపంచమంతా తనకు వ్యతిరేకంగా ఉందనే భావన కలిగేదని వెల్లడించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.